
సాక్షి
తిరుపతి

గురువారం । 25 । జనవరి । 2024



దరఖాస్తుల ఆహ్వానం
శ్రీకాళహస్తీశ్వరుని బ్రహ్మోత్సవాల్లో సాంస్కృతి ప్రదర్శన ఇచ్చేందుకు కళాకారులు దరఖాస్తు చేసుకోవాలని ఈఓ కోరారు. - 10లో



మంత్రి రోజాపై ఆరోపణలు అవాస్తవం
మంత్రి ఆర్‌కే రోజాపై కౌన్సిలర్ భువనేశ్వరి చేసిన ఆరోపణలు అవాస్తవమని మున్సిపల్ చైర్మన్ స్పష్టం చేశారు. - 10లో



విద్యుదాఘాతంతో లైన్‌మన్..
సైదాపురం మండలం వేములచేడు గ్రామంలో బుధవారం విద్యుదాఘాతానికి గురై లైన్‌మన్ మరణించాడు. - 10లో

న్యూస్‌రీల్

పకడ్బందీగా జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్



అధికారులతో మాట్లాడుతున్న విజయకుమార్‌రెడ్డి

తిరుపతి అర్బన్ : ప్రభుత్వ ఆదేశాల మేరకు పకడ్బందీగా జర్నలిస్ట్ హౌసింగ్ స్కీమ్ అమలు చేయాలని, అందులో భాగంగా ఎప్పటికప్పుడు సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర సమాచార పౌరసంబంధాల శాఖ కమిషనర్ టి.విజయకుమార్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్‌లోని పౌరసంబంధాలశాఖ కార్యాలయాన్ని ఆయన సందర్శించారు. కమిషనర్ మాట్లాడుతూ జర్నలిస్ట్ అక్రిడిటేషన్ కమిటీ సమావేశాల నిర్వహణపై ఆరా తీశారు. జిల్లా అధికారులు సమాధానమిస్తూ ఈ నెల 3వ తేదీన సమావేశం నిర్వహించామని చెప్పారు. ఇప్పటి వరకు జిల్లాలో 666 మందికి అక్రిడిటేషన్లు పంపిణీ చేశామని, 583 మంది జర్నలిస్టులు హౌసింగ్ స్కీమ్ కింద దరఖాస్తు చేసుకున్నారని వివరించారు. కార్యక్రమంలో డీపీఆర్‌ఓ విజయసింహారెడ్డి, చిత్తూరు డీపీఆర్‌ఓ వెంకటరమణ, తిరుపతి డివిజన్ డీపీఆర్‌ఓ ఈశ్వరమ్మ పాల్గొన్నారు.

చీడపీడల నివారణపై అవగాహన



మాట్లాడుతున్న ఏడీఏ భాస్కరయ్య

తొట్టంబేడు (శ్రీకాళహస్తి) : వరి పంటలో చీడపీడల నివారణపై రైతులకు వ్యవసాయశాఖ జిల్లా వనరుల కేంద్రం ఏడీఏ భాస్కరయ్య అవగాహన కల్పించారు. బుధవారం పెద్దమిట్టకండ్రిగలో ఆత్మ సహకారంతో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ప్రస్తుతం చలి తీవ్రత అధికంగా ఉండడం వల్లే వరిలో జింకు లోపం తలెత్తుతోందని, అగ్గి తెగులు, దోమపోటు, మానిపండు తెగులు ఆశిస్తున్నాయని వెల్లడించారు. తెగుళ్లను రైతులు సకాలంలో గుర్తించి, వ్యవసాయశాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లాలన్నారు. వారి సలహాల మేరకు మందులు పిచికారీ చేసుకోవాలని సూచించారు. వరి పైరుకి సరిపడా మాత్రమే నీరు పెట్టాలని కోరారు. చిరుపొట్ట దశలో 30 నుంచి 40 కిలోల యూరియా, 20 కిలోల పోటాష్ వేసుకోవాలని చెప్పారు. ఆర్‌బీకేల్లో ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉన్నట్లు వెల్లడించారు. అనంతరం ఎరువులు, నీటి యాజమాన్య పద్ధతులను వివరించారు. కార్యక్రమంలో ఏడీఏ రమేష్‌రెడ్డి, సర్పంచ్ బాలిరెడ్డి, ఏఓలు వేణుగోపాల్‌రావు, సుధాకర్‌రెడ్డి, ఇఫ్కో క్షేత్రాధికారి మణిచంద్ర, సర్వేశ్వర్‌రావు పాల్గొన్నారు.

శ్రీవారి దర్శనానికి 6 గంటలు

తిరుమల : తిరుమలలో భక్తుల రద్దీ సాధారణంగా ఉంది. క్యూకాంప్లెక్స్‌లో 2 కంపార్ట్‌మెంట్లు నిండాయి. సోమవారం అర్ధరాత్రి వరకు 63,665 మంది స్వామివారిని దర్శించుకున్నారు. 18,630 మంది భక్తులు తలనీలాలు సమర్పించారు. శ్రీవారికి కానుకల రూపంలో హుండీ ద్వారా రూ.3.44 కోట్లు సమర్పించారు. టైం స్లాట్ టికెట్లు కలిగిన భక్తులకు సకాలంలోనే దర్శనమవుతోంది. టికెట్లు లేని వారికి 6 గంటల్లో దర్శనం లభిస్తోంది. ప్రత్యేక ప్రవేశ టికెట్లు కలిగిన భక్తులకు 2 గంటల్లో దర్శనమవుతోంది.

జేఈఈ మెయిన్స్ ప్రారంభం

తిరుపతి ఎడ్యుకేషన్ : ప్రతిష్టాత్మకమైన ఐఐటీ, ఎన్ఐటీ, ట్రిపుల్ ఐటీల్లో ప్రవేశానికి ఏటా ఎన్‌టీఏ నిర్వహించే జేఈఈ మెయిన్స్ బుధవారం ప్రారంభమయ్యాయి. తిరుపతి జిల్లాకు సంబంధించి చెర్లోపల్లె, రామిరెడ్డిపల్లెలోని అయాన్ డిజిటల్ కేంద్రాలు, పుత్తూరులోని ఎస్వీ పెరుమాళ్ ఇంజినీరింగ్ కళాశాలలో 3 కేంద్రాలను ఏర్పాటు చేశారు. తొలిరోజు రెండు సెషన్స్‌లో నిర్వహించిన పరీక్షకు 267మందికి గాను 231మంది విద్యార్థులు హాజరైనట్లు సిటీ కో–ఆర్డినేటర్ టి.కైలాష్ తెలిపారు.

ఆకట్టుకున్న 'బర్డ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్'

తిరుపతి సిటీ : తిరుపతిలోని ఎస్వీ యూనివర్సిటీ జువాలజీ విభాగంలో బుధవారం నిర్వహించిన బర్డ్ ఫొటోగ్రఫీ ఎగ్జిబిషన్ ఆకట్టుకుంది. ×క్యాప్చరింగ్ ఫెదర్డ్ వండర్స్ పేరిట ఏర్పాటు చేసిన ప్రదర్శనలో ప్రతిభావంతులైన పలువురు ఫొటోగ్రాఫర్లు పాల్గొన్నారు. స్టాంపులు, రిజిస్ట్రేషన్‌శాఖ డీఐజీ వి.కిరణ్ కుమార్ 200లకు పైగా పక్షి జాతుల ఫొటోలను ప్రదర్శించి అభినందనలు అందుకున్నారు.



ముఖ్యమంత్రికి స్వాగతం పలుకుతున్న మంత్రి పెద్దిరెడ్డి, టీటీడీ చైర్మన్ భూమన, డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రి రోజా, ఎంపీ గురుమూర్తి, ఎమ్మెల్సీ సుబ్రమణ్యం

సాదర స్వాగతం



పుష్పగుచ్ఛం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు రామ్‌కుమార్‌రెడ్డి, ఎమ్మెల్యేలు మధుసూదన్‌రెడ్డి, సంజీవయ్య, ఆదిమూలం, ఎమ్మెల్సీ చంద్రశేఖర్‌రెడ్డి, కల్యాణ్‌చక్రవర్తి, మురళీధర్

- ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు హాజరైన సీఎం వైఎస్ జగన్
- రేణిగుంట ఎయిర్‌పోర్టులో ఘనంగా ఆహ్వానం పలికిన మంత్రులు, ప్రజాప్రతినిధులు

సాక్షి, తిరుపతి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి బుధవారం తిరుపతిలో నిర్వహించిన ఇండియా టుడే ఎడ్యుకేషన్ సమ్మిట్‌కు హాజరయ్యారు. ఈ మేరకు సాయంత్రం 4.30 గంటలకు ఆయన ప్రత్యేక విమానంలో రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం విమానాశ్రయం నుంచి ముఖ్యమంత్రి రోడ్డు మార్గంలో తిరుపతిలోని ఓ ప్రైవేట్ హోటల్‌కు చేరుకున్నారు. అక్కడ నిర్వహించిన ఎడ్యుకేషన్ సమ్మిట్‌లో పాల్గొన్నారు. తిరిగి రోడ్డు మార్గంలో రేణిగుంట ఎయిర్‌పోర్టుకు చేరుకుని గన్నవరానికి పయనమయ్యారు. తిరుపతి పర్యటనకు వచ్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి డిప్యూటీ సీఎం నారాయణస్వామి, మంత్రులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, ఆర్‌కే రోజా, టీటీడీ బోర్డు చైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఎంపీలు గురుమూర్తి, రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి, బియ్యపు మధుసూదన్‌రెడ్డి, కిలివేటి సంజీవయ్య, ఆరణి శ్రీనివాసులు, కోనేటి ఆదిమూలం, కె.శ్రీనివాసులు, ఆర్టీసీ వైస్ చైర్మన్ విజయానందరెడ్డి, ఎమ్మెల్సీలు సిపాయి సుబ్రమణ్యం, భరత్, పి.చంద్రశేఖర్‌రెడ్డి, తిరుపతి కార్పొరేషన్ మేయర్ శిరీష, డిప్యూటీ మేయర్ అభినయ్‌రెడ్డి, తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి, కలెక్టర్ వెంకటరమణారెడ్డి, తిరుపతి, చిత్తూరు ఎస్పీలు పరమేశ్వర్‌రెడ్డి, రిశాంత్‌రెడ్డి, తిరుపతి నగరపాలక సంస్థ కమిషనర్ హరిత, జాయింట్ కలెక్టర్ శుభం భన్సల్ తదితరులు ఘనంగా స్వాగతం, వీడ్కోలు పలికారు.

వన్నెకుల క్షత్రియుల కల నెరవేర్చాం



శిలాఫలకం ఆవిష్కరణలో మంత్రి పెద్దిరెడ్డి, ఎంపీ, జెడ్పీ చైర్మన్, ఎమ్మెల్సీలు, మున్సిపల్ చైర్మన్

- టీడీపీ హయాంలో మొండి గోడలకే పరిమితం
- రూ.5 కోట్లతో వన్నెకుల క్షత్రియ భవనం నిర్మించాం
- మీ కోసం తాపత్రయ పడుతున్న భరత్‌ను వచ్చే ఎన్నికల్లో గెలిపించండి
- మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

కుప్పం: కుప్పం నియోజకవర్గంలో అధికంగా ఉన్న వన్నెకుల క్షత్రియుల ఏళ్ల తరబడి కలగా మిగిలిన భవనాన్ని పూర్తి చేసి వారి కల నెరవేర్చామని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి తెలిపారు. బుధవారం గుడుపల్లె మండలం గుత్తార్లపల్లి వద్ద నూతనంగా నిర్మించినా వన్నెకుల క్షత్రియ భవనాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వం మట్టిగోడలకే పరిమితమైన వన్నెలకు క్షత్రియ భవనాన్ని, సుమారు రూ.5 కోట్లతో ఎమ్మెల్సీ భరత్ పట్టుబట్టి పూర్తి చేయించారని తెలిపారు. వన్నెకుల క్షత్రియుల కల నెరవేర్చిన భరత్‌కు వచ్చే ఎన్నికల్లో మీరంతా సహాయ సహకారాలు అందించాలని కోరారు. గత టీడీపీ ప్రభుత్వంలో రూ.2 కోట్లతో వన్నెకుల క్షత్రియ భవనం నిర్మిస్తున్నట్లు టీడీపీ నాయకులు చెప్పి కుప్పం ప్రజలను మోసం చేశారన్నారు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చిన తరువాత వన్నెకుల క్షత్రియ భవనం పూర్తి కోసం భరత్ చొరవ తీసుకున్నారని, మీ కోసం ఎంతగానో తాపత్రయ పడుతున్న అతన్ని గెలిపించుకోవాల్సిన బాధ్యత మీదే అన్నారు.

మాజీ సర్పంచ్ కుటుంబానికి పరామర్శ

గుడుపల్లె మండలం సోడిగానిపల్లి పంచాయతీ మాజీ సర్పంచ్, సీనియర్ నాయకులు గోవిందప్ప గుండెపోటుతో మృతి చెందారు. బుధవారం మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గోవిందప్పకు నివాళి అర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గోవిందప్ప మృతి బాధాకరమన్నారు. ధైర్యంగా ఉండాలని, తాము అండగా ఉంటామని మంత్రి పెద్దిరెడ్డి వారి కుటుంబ సభ్యులకు భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎంపీ రెడ్డెప్ప, జెడ్పీ చైర్మన్ శ్రీనివాసులు, ఎమ్మెల్సీలు భరత్, సిపాయి సుబ్రమణ్యం, రెస్కో చైర్మన్ సెంథిల్ కుమార్, మున్సిపల్ చైర్మన్ డా.సుధీర్ రాష్ట్ర వన్నెకుల చైర్మన్ వనిత, ఎంపీపీలు, జెడ్పీటీసీలు, వన్నెకుల క్షత్రియ నాయకులు మురుగేష్, సీపీ మనోహర్, మునిరత్నం, విజయ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

తిరుమలలో 'వసతి'కి వినూత్న యత్నం

తిరుమల : ఏప్రిల్‌కు సంబంధించి ఆన్‌లైన్‌లో శ్రీవారి దర్శన టికెట్లు పొందిన భక్తులకు మాత్రమే వసతి గదులను టీటీడీ కేటాయించింది. ఈ నెల 18 నుంచి 25వ తేదీ వరకు శ్రీవారి ఆర్జిత సేవలు, లక్కీడిప్, వృద్ధులు, వికలాంగుల కోటా, శ్రీవాణి ట్రస్ట్, రూ.300 ప్రత్యేక ప్రవేశ టికెట్లను టీటీడీ జారీ చేసింది. అందులో భాగంగా బుధవారం ఉదయం 10గంటలకు ఆన్‌లైన్‌లో విడుదల చేసిన రూ.300 ప్రత్యేక ప్రవేశదర్శనం (ఎస్ఈడీ) టికెట్లను భక్తులు 2గంటల 45 నిమిషాల్లోనే కొనుగోలు చేశారు. ఈనెల 23న వృద్ధులు, వికలాంగుల దర్శన టోకెన్లు 15 నిమిషాల వ్యవధిలోనే భక్తులకు పొందారు. అంగప్రదక్షిణ టోకెన్లను ఐదు నిమిషాల్లోనే బుక్ చేసుకోవడం విశేషం.

తొలిసారిగా..

తిరుమల, తిరుపతిలో వసతి గదుల బుకింగ్‌ను బుధవారం మధ్యాహ్నం 3గంటలకు ఆన్‌లైన్‌లో చేపట్టారు. అయితే ఇందులో మొదటిసారిగా ఏప్రిల్ దర్శన టికెట్లు, టోకెన్లు పొందిన భక్తులకు మాత్రమే వసతి గదులను ఆన్‌లైన్‌లో పొందేందుకు అనుమతించామని తితిదే ఐటీ జీఎం సందీప్‌రెడ్డి తెలిపారు. గతంలో దర్శన టికెట్లు కలిగిన భక్తులు గదులు దొరక్క ఇబ్బందిపడేవారు, ఈ క్రమంలో దర్శన టికెట్లు కలిగిన భక్తులకు మాత్రమే గదులను కేటాయించింది.

ఘనంగా పరాక్రమ్ దివస్



చిత్రలేఖనం పోటీల్లో విద్యార్థులు

తిరుపతి కల్చరల్: నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకుని బుధవారం తిరుపతిలోని కేంద్రీయ విద్యాలయం–1లో పరాక్రమ్ దివస్‌ను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా 'పరాక్రమ్ దివస్–2024 థీమ్ నేతాజీ' అనే అంశంపై విద్యార్థులకు చిత్రలేఖన పోటీలు చేపట్టారు. భారతీయులను స్వాతంత్ర్యం కోసం పోరాడేలా ప్రేరేపించిన జాతీయ వీరుడిగా నేతాజీ వారసత్వాన్ని ఆవిష్కరిస్తూ ఏర్పాటు చేసిన ఈ పోటీల్లో సుమారు 100 మంది విద్యార్థులు పాల్గొన్నారు. అద్భుత రీతిలో జాతీయత ఉట్టిపడేలా చిత్రాలు చిత్రించి తమ దేశభక్తిని చాటుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు. భారతీయ విద్యాభవన్ 9వ తరగతి విద్యార్థి ఎస్.కీర్తి ప్రథమ బహుమతి కైవసం చేసుకుంది. కేంద్రీయ విద్యాలయం ప్రిన్సిపల్ అనురాధ మాట్లాడుతూ నేతాజీ వ్యూహాత్మక దృక్పథం, రాజకీయ తత్వ శాస్త్రం, ఆయన రచనలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. సుభాష్ చంద్రబోస్ నిలబెట్టిన విలువలు, ఆదర్శాలతో యువత మనస్సులు సుసంపన్నమయ్యాయని తెలిపారు.



ఫస్ట్ ప్రైజ్ అందుకుంటున్న విద్యార్థిని కీర్తి (ఇన్‌సెట్) ప్రథమ బహుమతి పొందిన చిత్రం

అర్హులందరికీ 'సంక్షేమం'

- రూ.22.08 కోట్ల 'ఆసరా' చెక్కులు పంపిణీ చేసిన తుడా చైర్మన్ మోహిత్‌రెడ్డి



లబ్ధిదారులకు మెగా చెక్కు అందిస్తున్న తుడా చైర్మన్ చెవిరెడ్డి మోహిత్ రెడ్డి

చంద్రగిరి : కులమతాలు, పార్టీలతో ప్రమేయం లేకుండా.. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదర్శవంతంగా నిలిచారని తుడా చైర్మన్, వైఎస్సార్‌సీపీ చంద్రగిరి ఎమ్మెల్యే అభ్యర్థి చెవిరెడ్డి మోహిత్‌రెడ్డి తెలిపారు. బుధవారం పాకాల, చంద్రగిరిలో నిర్వహించిన వైఎస్సార్ ఆసరా పథకం కింద నాలుగో విడత నగదు పంపిణీలో ఆయన పాల్గొన్నారు. పాకాలలో రూ.10.47 కోట్లు, చంద్రగిరిలో రూ.11.61 కోట్ల చెక్కులను స్వయం సహాయక సంఘాల సభ్యులకు అందించారు. మహిళలు ఏర్పాటు చేసిన స్టాల్స్ సందర్శించారు. వై ఏపీ నీడ్స్ జగన్ కార్యక్రమంలో భాగంగా సంక్షేమ బోర్డు ఆవిష్కరించారు. పార్టీ జెండాను ఎగురవేశారు. అనంతరం మోహిత్‌రెడ్డి మాట్లాడుతూ అక్క చెల్లెమ్మలు ఆనందంగా ఉంటే వారి కుటుంబాలతోపాటు రాష్ట్రం సర్వతోముఖాభివృద్ధి చెందుతుందన్నారు. వైఎస్సార్ ఆసరా నగదు మహిళలకు ఆర్థిక భరోసా ఇస్తోందని తెలిపారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో పొదుపు సంఘాల రుణాలు మాఫీ చేస్తామని హామీ ఇచ్చిన చంద్రబాబు అధికారంలోకి వచ్చాక విస్మరించారని ఆరోపించారు. సున్నా వడ్డీ పథకాన్ని కూడా రద్దు చేశారని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చిన వైఎస్సార్‌సీపీని ఆశీర్వదించాలని కోరారు. మేనిఫెస్టోను భగవద్గీత, ఖురాన్, బైబిల్‌గా భావించి ఇచ్చిన హామీలను 99 శాతం నెరవేర్చిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రతి ఒక్కరూ అండగా నిలవాలని పిలుపునిచ్చారు. దేశంలో ఎక్కడా లేని విధంగా రూ.3వేల సామాజిక పింఛన్ అందిస్తున్నారని వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో ప్రతిపక్ష పార్టీలు మోసపూరిత హామీలతో ముందుకు వస్తారని హెచ్చరించారు. ఆచరణ సాధ్యం కాని హామీలను గుప్పిస్తారన్నారు. అభివృద్ధి నిరంతరం ప్రక్రియ అని, నాలుగున్నరేళ్లుగా చంద్రగిరి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అగ్రగామిగా తీర్చిదిద్దామని తెలిపారు. ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్‌రెడ్డి చూపిన బాటలోనే తాము సాగుతామని, ఎల్లప్పుడూ ప్రజలకు అందుబాటులో ఉంటూ సేవ చేసుకుంటామని స్పష్టం చేశారు. నియోజకవర్గ వాసులను కుటుంబసభ్యులుగా భావిస్తామని, కష్ట సుఖాల్లో తోడుగా ఉంటామని వివరించారు. ఇప్పటి వరకు పాకాల పంచాయతీలో రూ.19కోట్లు, చంద్రగిరిలోనూ రూ.40 కోట్లతో వివిధ అభివృద్ధి పనులు చేపట్టామని తెలిపారు. సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలు తమను ఆశీర్వదించాలని కోరారు.



స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేసిన స్టాల్‌ను పరిశీలిస్తున్న మోహిత్‌రెడ్డి

అవసరాల మేరకు విద్యుత్ .. డీజిల్ బస్సులు

- ఆర్టీసీ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి

తిరుపతి అర్బన్ : రాష్ట్రవ్యాప్తంగా ఆర్టీసీ త్వరలో వెయ్యి విద్యుత్, 1500 డీజిల్ బస్సులను తీసుకురానుందని ఆ సంస్థ బోర్డు డైరెక్టర్ రాజారెడ్డి తెలిపారు. జాతీయ డ్రైవర్ల దినోత్సవం సందర్భంగా బుధవారం ఆయన ఇన్‌చార్జి ఈడీ, తిరుపతి డీపీటీఓ చెంగల్‌రెడ్డితో కలిసి తిరుపతి, అలిపిరి, మంగళం డిపోలను సందర్శించారు. ఆయన మాట్లాడుతూ ఆర్టీసీ డ్రైవర్లు ప్రమాదాలకు దూరంగా ఉండాలని సూచించారు. ప్రయాణికులకు మెరుగైన సౌకర్యాలు కల్పించడానికి పలు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. త్వరలో రాష్ట్ర వ్యాప్తంగా వెయ్యి విద్యుత్ బస్సులు పలు డిపోలకు రానున్నాయన్నారు. అలాగే 1500 కొత్త డీజిల్ బస్సులు కూడా రాష్ట్ర వ్యాప్తంగా ఏర్పాటు చేయనున్నారని వెల్లడించారు. ఆర్టీసీ కష్టాలను ఎవరూ పట్టించుకోలేదని అయితే సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ఆర్టీసీ కార్మికులను ప్రభుత్వంలో విలీనం చేసి, ఉద్యోగులను చేశారని చెప్పారు. కోవిడ్ సమయంలో ఒక్క బస్సు కదలలేదని, ఒక కిలోమీటరు కూడా తిరగలేదని తెలిపారు. అయినా ఆర్టీసీ ఉద్యోగులకు క్రమం తప్పకుండా సీఎం జగన్‌మోహన్‌రెడ్డి జీతాలు ఇప్పించారన్నారు. ఆర్టీసీ ఉద్యోగులకు అండగా ఉంటూ ఎప్పటికప్పుడు వారి సమస్యలకు పరిష్కారం చూపుతున్నారని చెప్పారు. ఆర్టీసీ కార్గో ఆదాయం రాష్ట్ర వ్యాప్తంగా గత ఏడాది రూ.200 కోట్లు వచ్చిందని చెప్పారు. ఈ ఏడాది రూ.500 కోట్లు రాబడి సాధించడానికి కృషి చేయాలని తెలిపారు. ఉద్యోగ విరమణ పొందనున్న ఉద్యోగులకు ఈహెచ్‌ఎస్ సౌకర్యాన్ని కల్పించడానికి ప్రభుత్వం సానుకూలంగా ఉందని చెప్పారు. ఆర్టీసీ ఉద్యోగ సంఘాలకు రాష్ట్ర ప్రభుత్వం గుర్తింపును ఇచ్చిందన్నారు. మరోవైపు ప్రయాణికులకు పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సులను ఏర్పాటు చేయడంతో పాటు చార్జీలను పెంచకుండా సాధారణ చార్జీలతోనే నడిపిందని చెప్పారు. గత ప్రభుత్వం రూ.2500 కోట్లు ఆర్టీసీ బకాయిలను పెండింగ్ పెడితే, సీఎం జగన్‌మోహన్‌రెడ్డి వాటిని చెల్లించారని చెప్పారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ సీటీఎం భాస్కర్‌రెడ్డి, అలిపిరి ఇన్‌చార్జి డీఎం రాజశేఖర్, అసిస్టెంట్ డీఎం పుష్పలత పాల్గొన్నారు. అలాగే మంగళం డిపోను సందర్శించిన సందర్భంగా తప్పకుండా ఈ డిపోకు బస్టాండ్‌ను త్వరలో ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తున్నారని చెప్పారు.



డ్రైవర్ల దినోత్సవంలో ఆర్టీసీ కమిటీ డైరెక్టర్ రాజారెడ్డి

త్రివర్ణం.. సగర్వం



దేశభక్తిని చాటుకుంటూ 75 అడుగుల జాతీయ జెండాను విద్యార్థులు ప్రదర్శించారు. బుధవారం గూడూరు పట్టణంలోని రైల్వేస్టేషన్ నుంచి పురవీధుల్లో ర్యాలీ నిర్వహించారు. ఏబీవీపీ ఆధ్వర్యంలో చేపట్టిన ఈ ప్రదర్శనలో భారత్‌మాతా కీ జై అంటూ నినాదాలు చేశారు. మహనీయుల త్యాగాలను స్మరించుకున్నారు. కార్యక్రమంలో మల్లికార్జున్, రూపవతి, నిఖిత, చిన్నా, శివశంకర్ తదితరులు పాల్గొన్నారు.

– గూడూరు రూరల్

క్లుప్తంగా

విశ్వంలో ఉచిత సైనిక్ మోడల్ టెస్ట్ రేపు


తిరుపతి ఎడ్యుకేషన్ : నగరంలోని వరదరాజనగర్‌లో ఉన్న విశ్వం విద్యాసంస్థలో ఈ నెల 26వ తేదీన సైనిక్ మోడల్ టెస్ట్‌ను ఉచితంగా నిర్వహించనున్నట్లు ఆ విద్యాసంస్థ అధినేత డాక్టర్ ఎన్.విశ్వనాథరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 28వ తేదీన సైనిక్ విద్యాసంస్థల్లో 6, 9వ తరగతిలో ప్రవేశాలకు జాతీయ స్థాయిలో నిర్వహించనున్న ప్రవేశ పరీక్షకు అనుగుణంగా మోడల్ టెస్ట్‌ను నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. విద్యార్థులు సబ్జెక్టు పరంగా లోపాలను సరిదిద్దుకుని అసలైన పరీక్షకు సంసిద్ధం కావడానికి ఈ మోడల్ టెస్ట్ దోహదపడుతుందని తెలిపారు. ఈ ఉచిత మోడల్ టెస్ట్‌కు హాజరయ్యే విద్యార్థులు హాల్‌టికెట్(అడ్మిట్ కార్డు) జిరాక్స్ కాపీని వెంట తీసుకురావాలని, మరిన్ని వివరాలకు 86888 88802, 93999 76999నంబర్లలో సంప్రదించాలని కోరారు.

దరఖాస్తుల ఆహ్వానం

శ్రీకాళహస్తి: ముక్కంటి బ్రహ్మోత్సవాల సందర్భంగా సాంస్కృతిక ప్రదర్శనలు ఇవ్వడానికి ఆసక్తి ఉన్న కళా బృందాల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఈఓ కేఎస్ రామారావు తెలిపారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో మార్చి 3 నుంచి 16వ తేదీ వరకు మహాశివరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయన్నారు. ఆ సమయంలో దూర్జటి కళావేదికపై సాంస్కృతిక కార్యక్రమా లు నిర్వహించనున్నట్లు ఆయన పేర్కొన్నా రు. ఆసక్తి గల కళాకారులు ఫిబ్రవరి 15లోపు ఆల య కార్యాలయంలో దరఖాస్తులు అందజేయాలన్నారు.

చెరువులో బాలిక మృతదేహం

చిట్టమూరు : చిట్టమూరు గిరిజన కాలనీ సమీపంలోని చెరువులో గుర్తుతెలియని బాలిక (సుమారు 8) మృతదేహాన్ని బుధవారం స్థానికులు గుర్తించారు. సమాచారం అందుకున్న పోలీసులు గ్రామానికి చేరుకుని బాలిక మృతదేహాన్ని వెలికితీశారు. ఈ మేరకు వాకాడు సర్కిల్ పరిధిలో చిన్నారుల మిస్సింగ్ కేసులపై ఆరా తీస్తున్నారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం బాలిరెడ్డిపాళెం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



నవరత్నాలు– పేదలందరికీ ఇళ్లు పథకం ఓ ఉద్యమంటా సాగుతోంది. సూళ్లూరుపేట నియోజకవర్గంలో ఇప్పటికే సుమారు 6,759 మందికి గూడు కుదురుతోంది. ప్రభుత్వం అందించిన ఒకటిన్నర సెంటులోనే పేదల స్వప్నం సాకారమవుతోంది. ప్రతి ఒక్కరికీ ఆశ్రయం కల్పించాలన్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆశయం నేడు 135 కాలనీల రూపంలో ఆవిష్కృతమవుతోంది. ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య కృషి పూర్తిస్థాయిలో ఫలిస్తోంది. అత్యాధునిక వసతుల నడుమ నిరుపేదల నివాసం కొలువుదీరుతోంది. ప్రతిష్టాత్మక పథకం కింద గృహాలు పొందిన లబ్ధిదారుల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోంది.

– సూళ్లూరుపేట


మన్నారుపోలూరులో జగనన్న ఇళ్లు


మన్నారుపోలూరులో..

స్వగృహం.. నెరవేరిన స్వప్నం


నాయుడుపేటలో..



మళ్లీ జగనన్నే రావాలి

ఏళ్ల తరబడి బాడుగ ఇంట్లోనే ఉండేవాళ్లం. గత టీడీపీ ప్రభుత్వంలో పలువురు నేతలు, అధికారుల చుట్టూ తిరిగినా జానెడు స్థలం రాలేదు. జగనన్న వచ్చాకే మాకు ఇల్లు మంజూరైంది. హైవే పక్కనే లేఅవుట్‌లో స్థలం కేటాయించారు. ప్రభుత్వం రూ.1.80 లక్షలు అందించింది. మేం కొంత నగదు వేసుకుని చక్కగా గృహం నిర్మించుకున్నాం. ఇప్పుడు హాయిగా సొంతింట్లో నివసిస్తున్నాం. ఇంత మేలు చేసిన జగనన్నే మళ్లీ ముఖ్యమంత్రిగా గెలవాలి..రావాలి. **- కొండా బుజ్జమ్మ, తల్లంపాడు, దొరవారిసత్రం మండలం**


దొరవారిసత్రంలో..



రుణపడి ఉంటాం

అగ్రకులం పేరిట గతంలో మాకు ఎలాంటి సంక్షేమ పథకాలు అందేవి కావు. నా భార్య దివ్యాంగురాలు. దినసరి కూలీగా నేను సంపాదించే సొమ్ము తో ఇల్లు గడుస్తుంది. ఇంటి బాడుగ చెల్లించేందుకు నానా అవస్థలు పడేవాళ్లం. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి కుల, మతాలకు అతీతంగా, పేదరికమే ప్రామాణికంగా మాకు ఇల్లు మంజూరు చేశారు. మాంబట్టు లేఔట్‌లో కేటాయించిన స్థలంలో ఇల్లు కట్టుకుని అందులో చేరిపోయాం. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం.

- కామిరెడ్డి శ్రీనివాసులురెడ్డి- కస్తూరమ్మ, మాంబట్టు, తడ మండలం



మేలు మరువలేం

నా భర్త ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. 20 ఏళ్లపాటు అద్దె ఇంట్లోనే ఉండేవాళ్లం. గత టీడీపీ హయాంలో ఇంటి స్థలం మంజూరు చేయిస్తామని కొందరు నగదు తీసుకుని మోసం చేశారు. పిల్లల చదువు మాకు మోయలేని భారంగా ఉండేది. జగనన్న ముఖ్యమంత్రి అయిన తర్వాత బిడ్డల చదువుకు అమ్మఒడి, విద్యాదీవెన అందించారు. అలాగే పట్టణానికి సమీపంలోనే జాతీయ రహదారి పక్కన అయ్యప్ప రెడ్డిపాళెం వద్ద జగనన్న లేవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేశారు. ప్రభుత్వ సాయంతోపాటు కొంత నగదు వేసుకుని ఇల్లు కట్టుకున్నాం. జగనన్న మేలు జన్మలో మరువలేం.

- బల్లి మంజులమ్మ, అయ్యప్పరెడ్డిపాళెం, నాయుడుపేట మండలం

పదిహేనేళ్ల కల



సుమారు పదిహేనేళ్లపాటు సొంతింటికోసం ఎదురు చూశాం. కావలి నుంచి పొట్టచేత్తో పట్టుకుని సూళ్లూరుపేటకు వచ్చాం. అప్పటి నుంచి బాడుగ ఇంట్లోనే ఉండేవాళ్లం. గత టీడీపీ ప్రభుత్వంలో పలుమార్లు అర్జీలు ఇచ్చాం. ప్రయోజనం లేదు. నా భర్త ఆపాచీ కంపెనీలో చిన్నపాటి ఉద్యోగం చేస్తున్నారు. మాకు ఇద్దరు పిల్లలు. జీతంలో సగం ఇంటి అద్దెకే సరిపోయేది. జగనన్న ప్రభుత్వం రాగానే స్థలం ఇవ్వడంతోపాటు ఇల్లు మంజూరు చేశారు. ప్రస్తుతం ఇల్లు కట్టుకుని చేరిపోయాం. మాకు అమ్మ ఒడి, పింఛన్, ఆసరా, సున్నా వడ్డీ పథకాల ద్వారా కూడా లబ్ధి చేకూరింది.

- బండి ఉషారాణి, జగనన్న కాలనీ, మన్నారుపోలూరు

సంతోషంగా ఉంది



మాది పాలకొల్లు. బతుకుదెరువు కోసం సూళ్లూరుపేటకు సుమారు పదేళ్ల కిందట వచ్చేశాం. నాభర్త శ్రీసిటీలో కార్మికుడిగా పని చేస్తున్నాడు. మాకు వస్తున్న జీతంలో సగం ఇంటి అద్దెకే పోయేది. ఇప్పుడు జగనన్న పుణ్యమా అని ఇల్లు మంజూరు చేశారు. ఇప్పుడు ఇల్లు నిర్మించుకుని గృహ ప్రవేశం చేసేశాం. సొంతింట్లో చాలా సంతోషంగా ఉంది. మా కాలనీలో అన్ని వసతులు ఉన్నాయి. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటాం

- దివ్యసాహిత, మన్నారుపోలూరు

జగనన్న చలువే..



ఏళ్ల తరబడి సొంతింటి కోసం ఎదురు చూశాం. గత టీడీపీ ప్రభుత్వంలో ఇంటి స్థలం కోసం ఎన్ని సార్లు విన్నవించినా పట్టించుకున్న పాపాన పోలేదు. వైఎస్సార్‌సీపీ అధికారంలోకి రాగానే వలంటీర్ మాతో దరఖాస్తు చేయించారు. కొద్ది రోజులకే అనపగుంట లేఅవుట్‌లో ఇంటి స్థలం మంజూరు చేశారు. మాకు కేటాయించిన స్థలంలో సొంతిల్లు కట్టుని బాడుగల బాధల నుంచి బయట పడ్డాం. ఇదంతా జగనన్న చలువే.

- చెన్నూరు శారద-భాస్కర్, పల్లెపాళెం, తడ

తిరుపతిజిల్లాలో ఎస్‌ఐల బదిలీ

చిత్తూరు అర్బన్: తిరుపతి జిల్లాలో పలువురు ఎస్‌ఐలను బదిలీ చేస్తూ రాష్ట్ర డీజీపీ రాజేంద్రనాథ్‌రెడ్డి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో పలువురిని ఇతర జిల్లాలకు కేటాయిస్తూ ఉత్తర్వులో పేర్కొన్నారు. తిరుపతి జిల్లాలో పనిచేస్తున్న కె.శ్రీనివాసరావు, వై. శ్రీనివాసరావు, వీరనారాయణ, ఆదిలక్ష్మిని గుంటూరు జిల్లాకు, పులిరావు, గోపాల్‌ను పల్నాడు జిల్లాకు బదిలీ చేశారు. అలాగే గుంటూరు జిల్లాలో పనిచేస్తున్న కొల్లరామిరెడ్డి, చౌదయ్య, జగన్‌మోహన్‌రావు, శ్రీహరిబాబు, జెత్తయ్య నాయక్ తిరుపతి జిల్లాకు బదిలీ చేసినట్లు ఉత్తర్వులో పేర్కొన్నారు.

విద్యుదాఘాతంతో లైన్‌మన్ మృతి


మృత దేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

సైదాపురం : మండలంలోని వేములచేడులో బుధవారం విద్యుదాఘాతానికి గురై లైన్‌మన్ మృతి చెందాడు. వివరాలు.. సైదాపురానికి చెందిన చెంజి శ్రీనివాసులు (42) విద్యుత్ మరమ్మతులు చేస్తుండగా ప్రమాదం జరిగింది. తోటి ఉద్యోగుల సమాచారం మేరకు పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గూడూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ వాసు తెలిపారు.

వైఎస్సార్‌సీపీలోకి టీడీపీ కార్యకర్తలు

రామకుప్పం: మండలకేంద్రం రామకుప్పంకు చెందిన 40 మంది టీడీపీ కార్యకర్తలు, యువకులు బుధవారం చెల్దిగానిపల్లి వద్ద మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి సమక్షంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో చేరారు. మంత్రి వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి చేపడుతున్న అభివృద్ధికి ఆకర్షితులై వైఎస్సార్ సీపీలో చేరినట్లు తెలిపారు. కుప్పంలో భరత్ గెలుపే లక్ష్యంగా పని చేస్తామన్నారు. పార్టీలో చేరినవారిలో మహేష్, నరేంద్ర, మునిరాజ్, ముత్తు, భరత్, ఇంతియాజ్, నదీమ్, గణేష్, గోపి, శ్రీకాంత్, షంపేర్ ఉన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ విజలాపురం బాబురెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు నితిన్ రెడ్డి, ఎంపీపీ సుబ్రమణ్యం, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు మురళీకృష్ణ, పార్టీ కో–కన్వీనర్ చంద్రారెడ్డి, నాయకుడు మధుసూదన్ రెడ్డి, మండల యువత అధ్యక్షుడు యశ్వంత్ రెడ్డి, మాజీ ఎంపీపీ జయప్ప, సిద్ధప్ప, మండల కో ఆప్షన్ సభ్యుడు బరకతుల్లా తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీలో చేరిన వారితో మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి

డైరెక్టర్ ఆకుల శివ తల్లికి మంత్రుల నివాళి

కార్వేటినగరం: ప్రముఖ సినీ డైరెక్టర్, రచయిత ఆకుల శివ తల్లి ఆకుల మునిలక్ష్మమ్మ(92)ఇటీవల అనారోగ్యంతో మృతి చెందింది. బుధవారం ఆకుల శివ స్వగ్రామం సీడీ కండ్రిగ గ్రామంలో జరిగిన శుభ స్వీకరణకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కళత్తూరు నారాయణస్వామి, రాష్ట్ర పర్యాటక శాఖ, క్రీడాశాఖ మంత్రి ఆర్కే రోజ హాజరయ్యారు. ఈ సందర్భంగా మునిలక్ష్మమ్మ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం ఆకుల శివ కుటుంబ సభ్యులను పరామర్శించారు. తన తల్లి శుభ స్వీకరణ కార్యక్రమాన్ని ఆకుల శివ సుమారు 35 మంది బ్రాహ్మణోత్తములతో జరిపించారు. వేద పండితులకు గోదానం, వస్త్రదానం చేశారు. అలాగే ప్రముఖ సినీ డైరెక్టర్ వీవీ వినాయక్, ఇతర ప్రము ఖులు కూడా మునిలక్ష్మమ్మకు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ ఆకుల శివ తండ్రి ఆకుల సుబ్రమణ్యంశెట్టి గతంలో 30 ఏళ్లుగా సర్పంచ్‌గా ఎనలేని సేవలు అందించార ని గుర్తు చేశారు. వారి కుటుంబ సభ్యులు నేటికీ ప్రజా ప్రతినిధులుగా పంచాయతీ అభివృద్ధికి కృషి చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో డిప్యూటీ సీఎం కుమార్తె కృపాలక్ష్మి, ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ, మండల కన్వీనర్ శేఖర్‌రాజు, మాజీ కన్వీనర్ ధనంజయ వర్మ, జేసీ ఎస్ కన్వీనర్ పురంధర్, సింగిల్‌విండో అధ్యక్షుడు లోకనాథరెడ్డి, సుబ్రమణ్యం స్వామి ఆలయ అధ్యక్షుడు కేశవరెడ్డి, సర్పంచ్ గోవిందమ్మ, మునెయ్య, రాష్ట్ర బీజేపీ కార్యదర్శి కోలా ఆనంద్, బీజేపీ నాయకుడు యువరాజు, జిల్లా కాంగ్రెస్ డీసీసీబీ అధ్యక్షు డు పోటుగారి భాస్కర్, బలిజ సంఘం నాయకుడు గోపిరాయులు, చిత్తూరు బలిజ సంఘం అధ్య క్షు డు ఓ.ఎం రామదాసు, చిరంజీవి ఫ్యాన్స్ యువ త అధ్యక్షుడు పూల ప్రభాకర్, కేఎస్ఎస్ జిల్లా గౌరవ అధ్యక్షుడు లోకనాథ నాయుడు పాల్గొన్నారు.


మునిలక్ష్మమ్మ చిత్రపటం వద్ద నివాళులు అర్పిస్తున్న మంత్రులు నారాయణస్వామి, ఆర్కేరోజా

మంత్రి రోజాపై కౌన్సిలర్ ఆరోపణలు అవాస్తవం

తిరుపతి కల్చరల్: మున్సిపల్ చైర్మన్ పదవి కోసం మంత్రి ఆర్కే రోజా రూ.లక్షలు తీసుకున్నారని కౌన్సిలర్ భువనేశ్వరి చేసిన ఆరోపణలు అవాస్తవమని, దీన్ని తాము ముక్తకంఠంతో ఖండిస్తున్నామని పుత్తూరు మున్సిపల్ చైర్మన్ హరి తెలిపారు. బుధవారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఎమ్మెల్యేగా, సీఎం జగనన్న ఆశయాలకు అనుగుణంగా కులమతాలకు అతీతంగా ప్రజల సంక్షేమం కోసం నిరంతరం కృషి చేస్తున్నారని తెలిపారు. ఓసీ రిజర్వేషన్ స్థానంలో ఒక దళితుడైన తనను మున్సిపల్ చైర్మన్‌ను చేసిన ఘనత మంత్రి ఆర్కే రోజాకే దక్కుతుందన్నారు. అంతేకాక కరోనాలో సైతం 100 పడకల ఆస్పత్రిని ఏర్పాటు చేసి, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించి కాపాడిన గొప్ప వ్యక్తి మంత్రి రోజా అన్నారు. ఆర్కే రోజా ట్రస్టు ద్వారా రూ.1.50 కోట్లు ఖర్చు చేసి, పలు ప్రజా సంక్షేమ కార్యక్రమాలు నిర్వహించారన్నారు. మున్సిపల్ వైస్ చైర్మన్ శంకర్ మాట్లాడుతూ మంత్రి రోజాకు రూ.లక్షలు ఇచ్చానని చెబుతున్న భువనేశ్వరి మూడేళ్లుగా ఎందుకు అడగలేదని ప్రశ్నించారు. బాధితుడు వైఎస్సార్ సీపీ నేత సత్యం మాట్లాడుతూ సొంత లావాదేవీల్లో భాగంగా భూమి కొనుగోలు నిమిత్తం భువనేశ్వరి వద్ద తాను రూ.29 లక్షలు తీసుకున్న మాట వాస్తవమేనన్నారు. ఇందులో రూ.13 లక్షలు తిరిగి ఇచ్చేశానని, ఇంకా రూ.16 లక్షలు ఇవ్వాల్సి ఉందని తెలిపారు. డబ్బులు సర్దడం ఆలస్యం కావడంతో ఇవ్వలేకపోయాయన్నారు. అయితే మంత్రి రోజా కుటుంబ సభ్యులను టార్గెట్ చేస్తూ చైర్మన్ పదవి కోసం ఇచ్చానని చెప్పడం దుర్మార్గమన్నారు. కౌన్సిలర్లు టి.ఏకాంబరం, చిట్టిబాబు, గుణ, మునిరత్నం, జేసీఎస్ కన్వీనర్ కె.ఏకాంబరం, ఈశ్వర్ యాదవ్, చక్రి పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

నాయుడుపేట : పండ్లూరు మార్గంలోని స్వర్ణముఖి నర్సరీ వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందాడు. వివరాలు.. దొడ్డపనేని మదన్‌మోహన్‌నాయుడు(45) మెడికల్ రెప్రజెంటేటివ్‌గా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో నాయుడుపేటలోని మెడికల్ షాపుల నిర్వాహకులు, వైద్యులను కలిసేందుకు నెల్లూరు నుంచి వస్తుండగా ఎదురుగా వస్తున్న లారీ ఢీకొంది. దీంతో అక్కడికక్కడే మదన్‌మోహన్‌నాయుడు మరణించాడు. ఎస్‌ఐ రఘునాథ్ ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మృతుడు నెల్లూరులోని ఫత్తేఖాన్‌పేటకు చెందినవాడని ఎస్‌ఐ తెలిపారు.